"ఛీ! ఈ గారెలని మేం ఎలా తినగలం?" అసహ్యించుకుంటూ ఆకులని దూరంగా తోసేసారు శిష్యులంతా.

"దొమ్మరిసాని ఆట ఎటు జరుగుతోందో అటు వైపు వెళ్ళనట్లుగానే, అదే ప్రజ్ఞని ఇక్కడ కూడా మీరు ఉపయోగించచ్చుగా!"

శిష్యులకి గురువు తమకి బోధించదలచుకున్న పాఠం అర్థమవడంతో మళ్ళీ ఎన్నడూ ఆ ఉత్సవానికి వెళ్ళే ఆలోచన చేయలేదు. అంతేకాక ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారు దైవం మీద తప్ప మనసుని ప్రాపంచిక సుఖాల మీద పెట్టరాదన్న పాఠాన్ని కూడా నేర్చుకున్నారు.

## 54. ముగ్గురు శిష్యులు

కొంతకాలం తన దగ్గర ఆధ్యాత్మిక విద్యని అభ్యసించిన ముగ్గురు శిష్యులకి, తను బోధించింది ఎంతదాకా పట్టుబడిందో తెలుసుకోవాలన్న తలంపు ఓ గురువుకి కలిగింది. అందుకు వారికో పరీక్ష పెట్టాడాయన. ఆ ముగ్గురినీ పిలిచి మూడు కపాలాలు చూపించి అడిగాడు.

"ఈ మూడిటిలో ఏది ఓ మహాత్ముడికి చెందిందో మీరు కనుక్కోగలరా?"

ఓ శిష్యుడు ఆ మూడింటి బరువుని తూచి, ఎక్కువ బరువున్న కపాలం మహాత్ముడికి చెందిందిగా నిర్ణయించాడు.

రెండో శిష్యుడు ఆ మూడిటిలో ఏది ఎక్కువ తెల్లగా ఉందో పరిశీలించి చూసి, ఆ కపాలం మహాత్ముడికి చెందిందిగా నిశ్చయించాడు.

మూడో శిష్యుడు ఓ పొడవాటి దర్భపుల్లని తీసుకుని దాన్ని మొదటి కపాలం చెవిలోంచి పోనించాడు. అది రెండో చెవిలోంచి బయటకి వచ్చింది.

"స్వామీ. ఇది సామాన్యుడికి చెందిన కపాలం. ఇతను తను విన్న మంచి మాటలు ఓ చెవిలోంచి ఇంకో చెవి ద్వారా బయటికి వదిలేసే మనిషి."

తర్వాత అతను రెండో కపాలం చెవిలోంచి ఆ దర్భపుల్లని పోనించాడు. అది దాని నోట్లోంచి బయటకి వచ్చింది.

"స్వామీ. ఇతనూ సామాన్యుడే. తను విన్న మంచి మాటలు ఇతరులకి చెప్పేదాకా ఇతనికి తోచదు." చెప్పాడా శిష్యుడు.

ఆ దర్భపుల్లని మూడో కపాలం చెవిలోంచి అతను పోనిస్తే అది మెడ కింద భాగంలోంచి బయటకి వచ్చింది. వెంటనే ఆ శిష్యుడు చెప్పాడు.

"ఇతను తను విన్న మంచి విషయాలన్నీ హృదయంలోకి పంపి, దాన్ని ఆచరించే స్వభావం గలవాడు కాబట్టి ఇతను మహాత్ముడయ్యాడు."

ఆ శిష్యుడు పరిపక్వత చెందడంతో గురువు అతన్ని పంపేసాడు.

## 55. కాకిలా జీవించు

ఓ సన్యాసి తన శిష్యుడితో ఓ గ్రామంలో ఓ రోజు ఒక పెద్ద చెట్టు కింద బస చేసాడు. ఆ చెట్టు ఎదురుగా ఉన్న ఇంటి యజమాని దగ్గరికి ఆ సన్యాసి శిష్యుడు వెళ్లి తనకి, తన గురువుకి భోజనం పెట్టమని కోరాడు. అయితే అతను ఏదో కుంటి సాకు చెప్పి తప్పించుకున్నాడు కాని వాళ్ళకి భిక్ష చెయ్యలేదు.

ఆ సన్యాసి మహానుభావుడని రెండు రోజుల్లోనే గ్రహించిన ఆ యజమాని ఆ రాత్రి సన్యాసి దగ్గరకి వెళ్ళి తనకేదైనా ఉపదేశం ఇవ్వమని కోరాడు.

"అలాగే. ఈ రోజునించి నువ్వు కాకులని బాగా పరిశీలించి చూస్తూండు." చెప్పాడా సన్యాసి.

ఏడాది తర్వాత ఆ సన్యాసి తిరిగి అదే దారిలో వెళ్తూ, తన శిష్యుడితో అదే చెట్టు కింద బస చేసాడు. ఈసారి ఆ ఇంటి యజమాని సన్యాసికి, అతని శిష్యుడికి వారు అడగకుండానే వారా గ్రామంలో ఉన్నన్ని రోజులూ భోజనాల ఏర్పాటు తనే చేసాడు.